క్లుప్తంగా

ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టండి



దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని వివిధ రహదారుల్లో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన గురువారం రాజ్‌విహార్, వడ్డెగేరి, ఆర్‌ఎస్ రోడ్డు, ఆనంద్ థియేటర్, కిసాన్ ఘాట్, బాపూజీ నగర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ నరేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముర్తుజా వలీ ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు గురువారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు ఆర్‌డీఓగా వచ్చిన కిడారి సందీప్‌కుమార్, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి.రత్న ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఈపీ మహేశ్వరరెడ్డి కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పూలబొకేలు అందజేశారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై 7న సమీక్ష

కర్నూలు(సెంట్రల్): స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై అక్టోబర్ 7వ తేదీన జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన సునయన ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తారు.

సీపీఐలో చేరిక

కర్నూలు(సెంట్రల్): భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో 50 కుటుంబాలు చేరాయి. కర్నూలులోని బళ్లారి చౌరస్తా ఏరియాకు సంబంధించి పి.గోవిందు, ధనలక్ష్మీ, కాశీంబీలతోపాటు 50 కుటుంబాలు పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ నిరంతరం పోరాటాలు చేసే పార్టీ అని, పేదల పక్షాన ప్రతిరోజూ ఎర్ర జెండాను ఎత్తడమే తమ పార్టీ విధానమన్నారు. నాయకులు ఎస్.మునెప్ప, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రగ్బీ విజేత అనంతపురం




అనంతపురం బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి రగ్బీ బాలికల చాంపియన్‌షిప్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా అనంతపురం జట్టు, రన్నర్స్‌గా తూర్పుగోదావరి జిల్లా జట్టు, మూడో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచాయి. జిల్లా వృత్తి విద్యా అధికారి వై.పరమేశ్వర రెడ్డి, ఆర్‌ఐఓ గురువయ్య శెట్టి, విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు, అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ బహుకరించారు.

6న సాహిత్యోపన్యాసం

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా వికాస ఉద్యమం, సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ముచ్చుకోట వేంకట రామయ్య స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి కంద్రశేఖర కల్కూర తెలిపారు. 'స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు డాక్టర్ కె.బడెసాహెబ్ వక్తగా హాజరై ఉపన్యసిస్తారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



కిడారి సందీప్‌కుమార్

కర్నూలు రూరల్: కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారిగా కిడారి సందీప్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ ఆర్డీఓగా పని చేస్తున్న శేషిరెడ్డి బదిలీ అయ్యారు. ఈయన్ను జీఏడీకి రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు అందాయి. విజయనగరం జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కిడారి సందీప్‌కుమార్‌ను కర్నూలు ఆర్డీఓగా నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయం ఏఓ వేణుగోపాల్‌తో పాటు, సిబ్బంది, వివిధ మండలాల తహసీల్దార్లు ఆర్డీఓను కలిసి అభినందనలు తెలిపారు.

జగజ్జననీ.. జగన్మాత






నన్నూరులో గాయత్రీ దేవి అలంకరణ, కర్నూలు నిమిషాంబ దేవి ఆలయంలో.., నాగలాపురం సుంకులా పరమేశ్వరీ ఆలయంలో.., చిన్మయ మిషన్‌లో..



బుధవారపేటలో అష్టాదశ రూప దుర్గా మాత



సూర్యనారాయణ స్వామి ఆలయంలో..



రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో..



అంబాభవానీ ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా..



బుధవార పేట గురునానక్ వీధిలో..



చిన్నఅమ్మవారి శాలలో రాజరాజేశ్వరి అలంకరణ



గోదా గోకులంలో..

- ప్రారంభమైన దసరా శరన్నవరాత్రోత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



బుధవారపేటలోని దుర్గమ్మ గుడిలో..



కాళికాంబ ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా..



చిన్నఅమ్మవారి శాలలో అరుణాచలం కొండ నమూనా



పెద్దఅమ్మవారి శాలలో బాలాత్రిపుర సుందరిగా..

కర్నూలు కల్చరల్: జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం మొదటి రోజు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల కోలాహలంతో ఆలయాలన్నీ సందడిగా మారాయి. పలు ఆలయాల్లో బొమ్మల కొలువులు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. భక్తుల ఇళ్లలో సైతం బొమ్మల కొలువులు ఏర్పాటు చేసుకొని పేరంటాలు నిర్వహించారు. హోమాలు, అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణం, బుర్రకథ, హరికథ, కోలాటాలు, అన్నమాచార్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. కర్నూలు నగరంతో పాటు, శ్రీశైలం, నంద్యాల, మహానంది, ఆదోని, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందవరం, నందికొట్కూరు, బనగానపల్లె, ఆత్మకూరు, ఆలూరు, పాణ్యం, నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయం, నన్నూరు సరస్వతి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. కర్నూలు నగరంలోని బుధవారపేట కాళికాంబ ఆలయంలో కాత్యాయని దేవిగా, గీతా మందిరంలో శృంగేరి శారదాంబగా, ఆరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, ఓల్‌సిటీలోని చిన్నఅమ్మవారి శాలలో రాజరాజేశ్వరిగా, పెద్దఅమ్మవారి శాల, కాళికాంబ దేవాలయం, బండిమెట్ట అంబాభవానీ ఆలయం, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వీఆర్ కాలనీ చిన్మయ మిషన్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, చిన్న అమ్మవారి శాలలో ఏర్పాటు అరుణాచలం కొండ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో గోపూజ, రథోత్సవం, కోలాటం, హరికథ, అన్నమాచార్య సంకీర్తనలు ఏర్పాటు చేశారు.




గీతా మందిరంలో శృంగేరి శారదాంబ అలంకరణలో.., నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో..



లలితా పీఠంలో లలితా త్రిపుర సుందరి



విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

నిడ్జూరులో కంటి వైద్య శిబిరం



శిబిరంలో కళ్లజోడు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని నిడ్జూరులో గురువారం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఆర్.విష్ణువర్ధన్‌రెడ్డి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పెరుగు శివారెడ్డి, రీజినల్ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పెంచలయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి కళ్లజోడు, కంటి సమస్యలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రహేల్, డాక్టర్ క్రితిక, సత్యం రెడ్డి, శంకర్ రెడ్డి, సర్వేశ్వరరెడ్డి, సర్పంచ్ కె.మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



దీక్షలో మాట్లాడుతున్న బి.గిడ్డయ్య, జి.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు నాగన్న డిమాండ్ చేశారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా చౌక్‌లో రైతు, మహిళ, విద్యార్థి, సంఘాలు చేపట్టిన దీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల విశాఖలో పర్యటించిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఒప్పించి సెయిల్‌లో విలీనం చేస్తామని చెప్పి వెళ్లిపోయారన్నారు. అయితే వారు వెళ్లిన తరువాత పరిశ్రమలో స్టీలు ఉత్పత్తిని తగ్గించారని, కోల్‌ను రానీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కుటిల ప్రయత్నాలను అడ్డుకోవడంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్లాంటును ప్రైవేటీకరణ కానివ్వబోమని చెప్పిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడు ఏమి మాట్లడకపోవడం అన్యాయమన్నారు. పైగా స్టీలు ప్లాంటు ఉద్యమం చేస్తున్న కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా ప్రకటనలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటస్వామి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక కోసం నేడు కలెక్టరేట్ ముట్టడి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వస్తే భవన నిర్మాణాలకు ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడూ మీనమేషాలు లెక్కించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కొత్త పాలసీ ప్రకారం ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు పడుతోందని, అది కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉపాధి కరువై అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఇసుక విధానంపై విమర్శలు చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కలెక్టరేట్‌ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆందోళనకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కార్మికుల కడుపు కొడుతున్న టీడీపీ

కూటమి ప్రభుత్వం కార్మికుల కడుపు కొడుతోందని, ఉచిత ఇసుక పేరుతో సొమ్ము దండుకోవడంతో నిర్మాణ రంగం కుదేలైందని సీఐటీయూ నాయకులు ఎస్‌ఎండీ షరీఫ్, ఖాజాపాషా, అబ్దుల్ దేశాయ్ అన్నారు. గురువారం గడియారం ఆసుపత్రి సమీపంలోని మట్టి అడ్డా కార్మికులతో కలిసి ఉచిత ఇసుక కోసం సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు ఇసుకను అమ్ముకోవడంతో ప్రస్తుతం ఎక్కడా దొరకడం లేదన్నారు. దీంతో కొందరు బ్రోకర్లు ఎంటరై ట్రాక్టర్‌పై రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు.

ఓటరు జాబితా సర్వే పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వే చేపట్టాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన గురువారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8లపై అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువతకు ఓటు హక్కు కల్పించాలన్నారు. చనిపోయిన వారి పేర్ల తొలగింపు, సవరణలు, తప్పులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రెండు వారాల్లో ప్రక్రియ ముగుస్తుందని అర్హులు, అనర్హులు, మార్పు చేర్పుల ప్రక్రియలో జాప్యం చేయవద్దన్నారు. కర్నూలు తహసీలారు వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, వాజీద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా మెడికల్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ డాక్టర్లకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం ఎస్పీ బిందు మాధవ్ ప్రభుత్వాసుపత్రి, వివిధ ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులు ఎలా స్పందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు డాక్టర్లు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. కొరియర్ వచ్చిందని, లాటరీ తగిలిందని, గేమ్స్ ఆడితే డబ్బులు వస్తాయని, ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు వస్తుందని, ఓటీపీ ఫ్రాడ్ అని, ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ మార్చి ఖాతాలు హ్యాక్ చేస్తున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. హర్యానా, ఢిల్లీ రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని, పదేపదే వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే గంట లోపే 1930కి సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైం పోర్టల్‌లో www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ట్రాఫిక్ సమస్యలు, ఆటోడ్రైవర్ల వల్ల రోడ్లపై వాహనదారులకు తలెత్తుతున్న ఇబ్బందులు, తదితర విషయాలను డాక్టర్లు ఎస్పీ దృష్టికి తెచ్చారు. రోడ్డు ప్రమాదాలు జరిగి బాధితులు ఆసుపత్రిలోకి వచ్చినప్పుడు ఎంఎల్‌సీ, అకస్మాత్తుగా డెత్ వంటివి జరిగినప్పుడు బాధితుల నుంచి వచ్చే సమస్యలు, మెడికల్ కాలేజీ, హాస్టల్ వద్ద పోలీసు భద్రత, పోలీసు గస్తీ వంటి విషయాల గురించి ఎస్పీకి విన్నవించారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఐఎంఏ ప్రెసిడెంట్ రామచంద్ర నాయుడు, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి మాధవీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రేపు వీరశైవ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

కర్నూలు(హాస్పిటల్): వీరశైవ ఎంప్లాయిస్ అసోసియేషన్ వార్షికోత్సవ మహాసభ, వీరశైవ ప్రతిభా పురస్కారాల మహోత్సవ కార్యక్రమాలను ఈ నెల 5వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖరప్ప, కార్యదర్శి జి.జె.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక గుత్తి రోడ్డులోని వీవీఎస్ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా మంత్రి టీజీ భరత్, ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, విశిష్ట అతిథిగా టీజీ వెంకటేష్ హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వీరశైవ ప్రతిభావంతులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

రేపు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: నగరంలో పలు విద్యుత్ లైన్ల ఏర్పాటు, సబ్‌స్టేషన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం పలు కాలనీలలో 5వ తేదీన దాదాపు 6 గంటలపాటు విద్యుత్ కోతలు విధించనున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రకటించారు. విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని క్యాంప్‌ల సెక్షన్, ఓల్డ్ టౌన్ సెక్షన్, ఎస్టేట్ సెక్షన్ పరిధిలోని కాలనీలు, నగరాలలో విద్యుత్ కోతలు ఉంటాయని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఉరుములతో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): కొద్ది రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. తర్వాత ఒక్కసారిగా కర్నూలు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో భారీ ఉరుములతో కూడిన వర్షాలు కురిశాయి. ఉరుముల తీవ్రతకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దాదాపు 20 నిముషాల పాటు కర్నూలు వర్షం కురిసింది.

డిప్యూటీ వార్డెన్‌పై ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): కేవీఆర్ డిగ్రీ కళాశాల హాస్టల్ డిప్యూటీ వార్డెన్ సునీత తీరుపై విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. అన్నం బాగుండడం లేదని, అడిగితే బెదిరిస్తోందని, చెప్పినట్లు వినకపోతే తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపుతానని హెచ్చరిస్తోందని విద్యార్థులు ప్రిన్సిపాల్ వద్ద వాపోయారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): ఆర్‌ఐడీఎఫ్, నాబార్డు గ్రాంట్ కింద మైనర్ ఇరిగేషన్, జీవనోపాధుల కల్పన పనులకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌ఐడీఎఫ్, నాబార్డు గ్రాంట్ బేస్డ్ ప్రాజెక్టుల అమలు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాబార్డు గ్రాంట్ కింద జీవనోపాధుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. 5 వేలకు జనాభా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలో రైతుబజార్ల (రూరల్ హాట్స్) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ఇందుకు స్థలాలను కేటాయిస్తామని చెప్పారు. దేవనకొండ క్రాస్ వద్ద ఉల్లి మార్కెట్ ఏర్పాటు చేయాలన్నారు. కడప, చిత్తూరు జిల్లాల మాదిరిగానే స్థానికంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు రూరల్, అర్బన్ మార్ట్‌ల ద్వారా మార్కెటింగ్ కల్పించాలని ఆదేశించారు. చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, వృత్తి నైపుణ్యం కలిగిన వారితో వర్క్ స్టేషన్ల ఏర్పాటు, మత్స్య శాఖ ద్వారా హేచరీస్ ఏర్పాటు, ఆర్‌ఐడీఎఫ్ కింద మైనర్ ఇరిగేషన్ పనుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే చెరువుల తవ్వకంపై దృష్టి సారించాలన్నారు. పుచ్చకాయలమడ గ్రామానికి హంద్రీ కాలువ నుంచి డెలివరీ సిస్టం ద్వారా నీరు ఇచ్చేందుకు డీపీఆర్ రూపొందించాలని ఎస్‌ఈని ఆదేశించారు. ఇందుకు ఎస్టిమేట్స్ రూపొందించాలన్నారు. ఆర్‌ఐడీఎఫ్ కింద పూర్తయిన పనుల వివరాలు అప్‌డేట్ చేయించాలని, నిధులు విడుదల కాని పనులకు డీఓ లెటర్‌ను తయారు చేయాలని ఆదేశించారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ పథకాలపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆర్‌ఐడీఎఫ్ రుణాలు, నాబార్డు గ్రాంట్, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సబ్సిడీ పథకాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టడీటూరుకు కమిషనర్

కర్నూలు (టౌన్): పట్టణ ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందించేందుకు వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పనితీరును అధ్యయనం చేసేలా నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్టడీటూర్ చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకుల కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్టడీ టూర్‌లో భాగంగా ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కమిషనర్ పుణే మున్సిపల్ కార్పొరేషన్, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మహారాష్ట్ర మున్సిపల్ ఆడ్మినిస్ట్రేషన్, గుజరాత్ మున్సిపల్ ఆడ్మినిస్ట్రేషన్ పరిధిలో పర్యటిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఆస్తి పన్ను విధానాలు, ఇతర ఆర్థిక వనరులు, మంచి నీటి సరఫరా వ్యవస్థ, పన్నులు, వాణిజ్య అవసరాలకు సంబంధించి పన్నుల విధానం, తడి, పొడి చెత్త, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వంటి అంశాలను అధ్యయనం చేయనున్నారు. కమిషనర్‌తో పాటు ఆర్.సోమనారాయణ (విశాఖపట్నం అడిషనల్ కమిషనర్), శ్రీనాథ్ రెడ్డి (విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్) ఆర్.రామ్మోహన్ రెడ్డి (డీఎస్‌ఈ, అనంతపురం) పర్యటనకు వెళ్లనున్నారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నిహారిక రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నోటిని శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని దంత వైద్యులు డాక్టర్ ఎం.నిహారికరెడ్డి చెప్పారు. వరల్డ్ డెంటల్ డే సందర్భంగా గురువారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారిక రెడ్డి మాట్లాడుతూ.. నోటిని శుభ్రంగా ఉంచుకోకపోతే చిగుళ్ల వ్యాధి, హార్ట్ ఎటాక్, డయాబెటీస్ లాంటి అనేక రోగాలకు దారి తీస్తుందన్నారు. ఎక్కువసేపు బ్రష్ చేయడం వల్ల పంటిపై ఉండే ఎనామిల్ దెబ్బతింటుందని, అన్ని మూలలకు వెళ్లి శుభ్రం చేసే బ్రష్‌లతో రోజూ రెండు పూటలా బ్రష్ చేయాలని సూచించారు. షుగర్ క్యాండీలు, ఐస్‌క్రీమ్‌లను తగ్గించాలని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. హాస్పిటల్ వైస్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.